## క్లుప్తంగా

### ఆన్‌లైన్‌లోనే ఇంటి నంబర్ కేటాయింపు

నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా భవనం నిర్మించుకున్నవారు ఆస్తి పన్ను స్వీయ మదింపు (సెల్ఫ్ అసెస్‌మెంట్) చేసి వెబ్‌సైట్ ద్వారా డాక్యుమెంట్లు సమర్పించి ఇంటి నంబర్ పొందాలని మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయం చుట్టూ తిరగకుండానే ఇంటి నంబర్ కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటి నంబర్ కావల్సిన వారు రిజిస్ట్రేషన్ దస్తావేజులు, గృహ నిర్మాణ అనుమతి, ఆధార్ కార్డును https//emunicpal.telangana.gov.in వెబ్‌సైట్ లో అప్‌లోడ్ చేయాలని కోరారు. తప్పుడు సమాచారం ఇస్తే 25 రెట్లు జరిమానా విధిస్తారని తెలిపారు.

### 9న సర్వసభ్య సమావేశం

నకిరేకల్ : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు నకిరేకల్ ఎంపీడీఓ లక్ష్మారెడ్డి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

### 10 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో ఈ నెల 10వ తేదీ నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు గుండ్రాంపల్లి క్రికెట్ అసోసియేషన్ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనాలనుకునేవారు ఈ నెల 9వ తేదీలోపు 9948287518 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### నేడు ఎమ్మార్పీఎస్ సదస్సు

కట్టంగూర్ : ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈ నెల 7న నల్లగొండ పీఆర్‌టీయూ భవన్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు మునుగోటి ఉత్తరయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండలకేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

### క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండల కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక, ఈతరం యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నన్నూరి వెంకటరమణారెడ్డిలు శుక్రవారం ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని, సమాజంలో ఆదర్శంగా నిలవాలని అన్నారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఈతరం యూత్ సభ్యులు జంజిరాల సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మన్నెం భిక్షం, సీఐటీయూ మండల కన్వీనర్ భీమగాని గణేశ్, ఆకిటి లింగయ్య, రొట్టెల జానయ్య, సైదులు, శివ, శ్రీకాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### లూయిస్ బ్రెయిలీకి నివాళి

మునుగోడు : లూయిస్ బ్రెయిలీ వర్ధంతిని జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం మునుగోడులో నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి జేఏసీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. జేఏసీ జిల్లా చైర్మన్ తోట నర్సింహాచారి, ఉదయకృష్ణ, దావల శ్రీను, శంకర్, సత్తయ్య, శ్రీను పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన ఏర్పాటుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

మునుగోడు : మండలంలోని గూడపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందడం లేదని సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి చరణ్ స్పందించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సహాయ సహకారాలు అందిస్తానని, గతంలో వలె విద్యార్థులకు భోజనం వండిపెట్టేలా చూడాలని ఆ పాఠశాల ఉపాధ్యాయులతోపాటు గ్రామస్తులకు తెలిపారు. అదేవిధంగా కథనానికి స్పందించిన డీఈఓ భిక్షపతి.. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండిపెట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓను ఆదేశించారు.

### పర్యావరణం కాపాడాలి

నల్లగొండ టూటౌన్ : హరితహారం కార్యక్రమంలో స్థానికులు భాగస్వాములై మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.వీ.రమణాచారి కోరారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని 13వ వార్డులో హరిత శుక్రవారంలో భాగంగా స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో చెట్ల సంఖ్య తక్కువగా ఉన్నందున మొక్కలు నాటుతున్నామని, ప్రజలు కూడా తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఊట్కూరు వెంకట్‌రెడ్డి, మున్సిపల్ డీఈ వెంకన్న, ఏఈ రవీందర్, నాగయ్య పాల్గొన్నారు.


మొక్కకు నీరుపోస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణాచారి, కౌన్సిలర్

# మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం

చండూరు, గట్టుప్పల మండలాల్లో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయడానికి వచ్చిన ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. – సాక్షి నెట్‌వర్క్


గట్టుప్పలలో చిన్నారిని ఆప్యాయంగా పలకరిస్తున్న కేటీఆర్


చండూర్‌లో హెలికాప్టర్ దిగివస్తున్న కేటీఆర్


చండూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి


చండూరులో మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి


చండూరు : కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్


చండూరులో మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి


చండూరు : కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ రెమా రాజేశ్వరి

# సభను విజయవంతం చేయండి

నల్లగొండ టూటౌన్ : బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా నిర్వహించనున్న వర్చువల్ సభ విజయవంతం చేయాలని బీజేపీ నల్లగొండ అసెంబ్లీ పాలక్, మాజీ ఎంపీ గరికపాటి రామ్మోహన్‌రావు కోరారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ పట్టణంలోని ఏచూరి గార్డెన్‌లో శనివారం నిర్వహించనున్న సమావేశానికి ప్రతి పోలింగ్ బూత్ సభ్యుడు హాజరయ్యేవిధంగా పార్టీ శ్రేణులు చొరవ తీసుకోవాలని కోరారు. గతంలో పార్టీ అధ్యక్షులతోనే నిర్వహించే ఇలాంటి సభ, ఇప్పుడు పోలింగ్ బూత్ సభ్యులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, పార్టీ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, వీరెల్లి చంద్రశేఖర్, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, యాదగిరాచారి, నూకల వెంకట్‌నారాయణరెడ్డి, మొరిశెట్టి నాగేశ్వర్‌రావు, భవానీ ప్రసాద్,


మాట్లాడుతున్న మాజీ ఎంపీ రామ్మోహన్‌రావు

కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, బీపంగి జగ్జీవన్, పోతెపాక సాంబయ్య, దాయం భూపాల్‌రెడ్డి, చర్లపల్లి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

**వర్చువల్ సభకు తరలిరావాలి**

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా నిర్వహించనున్న వర్చువల్ సభకు పోలింగ్ బూత్ సభ్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మొరిశెట్టి నాగేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శనివారం ఏచూరి గార్డెన్‌లో సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### నేడు బీజేపీ సమావేశం

నకిరేకల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు శనివారం చిట్యాలలో నిర్వహించనున్న బీజేపీ బూత్ లెవల్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ప్రబారి కె. యాదగిరిరెడ్డి కోరారు. నకిరేకల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గవ్యాప్తంగా 305 బూత్‌లు ఉన్నాయని ఒక్కో బూత్‌కు 20 మంది చొప్పున ఈ సమావేశానికి హాజరవుతున్నారని చెప్పారు. బీజేపీ నియోజకవర్గ బాధ్యుడు చేపూరి రవీందర్, అసెంబ్లీ కన్వీనర్ మైల నర్సింహ, నాయకులు నకిరేకంటి మొగిలయ్య, గోలి ప్రభాకర్, పల్స శ్రీనుగౌడ్, రవీందర్‌రెడ్డి, ఇమ్మడి విజయ్‌కుమార్, అంజయ్య, నారగోని వెంకటేశ్వర్లు, చెవుగోని నాగయ్య ఉన్నారు.

# స్కీం వర్కర్లకు కనీస వేతనం అందించాలి

రామగిరి(నల్లగొండ) : కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని సీఐటీయూ తిప్పర్తి మండల కన్వీనర్ భీమగాని గణేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో స్కీం వర్కర్లతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కృష్ణయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ స్కీంలలో పనిచేస్తున్న కోటి మందికి పైగా కార్మికులలో అత్యధికంగా మహిళలు ఉన్నారన్నారు. కేంద్ర రాష్ట్ర పథకాలను ప్రజలకు చేరువచేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న వీరిపట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలు, వీఓఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏ జిల్లా నాయకురాలు మంత్రాల మంగమ్మ, ఆశ వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు పార్వతమ్మ, మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు యాదమ్మ, సైదమ్మ, ఉమా రాజేశ్వరి, వసంత, పుష్ప, రుతమ్మ, నాగమ్మ, ఎల్లమ్మ, రుద్రమ్మ, వెంకటమ్మ, పద్మ, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్ : వివిధ శాఖల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తు సీఐటీయూ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు, వీఓఏలు, సర్వశిక్ష అభియాన్ ఇతర స్కీమ్‌లలో పనిచేస్తున్న వారికి కనీస వేతనం అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, ఆరోగ్యబీమా, కల్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్యగౌడ్, పోలె సత్యనారాయణ, అనురాధ, పుష్పలత, అలివేలు, పద్మ, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.



తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న స్కీం వర్కర్లు

# ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న టీఎన్‌జీఓ నాయకులు, ఆశ కార్యకర్తలు

నల్లగొండ టౌన్ : తమ సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషిచేయాలని కోరుతూ శుక్రవారం ఆశ కార్యకర్తలు టీఎన్‌జీఓ ప్రతినిధులతో కలిసి నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆశ కార్యకర్తలకు వేతనాలను పెంచాలని, పనిభారం తగ్గించాలని కోరారు. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు మంత్రవాది శ్రవణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి కంచనపల్లి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు జె.శేఖర్‌రెడ్డి, రామచంద్రయ్య, ఎం.శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు ఆకునూరి లక్ష్మయ్య, కత్తుల మనోజ్, ప్రదీప్, సైదులు, నాగిళ్ల మురళి, పద్మావతి, దేవకి, వీరభద్రమ్మ, ప్రేమలత పాల్గొన్నారు.

### గోపాలమిత్ర రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

కట్టంగూర్ : మండల కేంద్రానికి చెందిన చెరుకు శ్రీనివాస్ ఇటీవల గోపాలమిత్ర రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఈ మేరకు శుక్రవారం ఆయనను మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి, సర్పంచ్ చెనగోని సతీష్ శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి శివ, ఐతగోని నర్సింహ, గోశిక అంజన్‌కుమార్, సోమగాని రామకృష్ణ, గుండు పరమేష్, ముత్యాల వెంకన్న, కానుగు శ్రీను, చిక్కుల లింగయ్య, ఐతగోని సైదులు, నాగరాజు, హనుమాన్ ఉన్నారు.

### చీరలు అందజేత


చీరలు అందజేస్తున్న వనమా వెంకటేశ్వర్లు

చిట్యాల : ఉరుమడ్ల గ్రామానికి చెందిన గుత్తా అమిత్‌రెడ్డి ఏర్పాటు చేసిన గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని 30 మంది కోలాట బృందం మహిళలకు చీరలు, కోలాటం కర్రలు, స్టీల్ బిందెలను శుక్రవారం గుత్తా యువ సేన అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పొలగోని స్వామి, మర్రి అబ్బయ్య, ట్రస్ట్ సభ్యులు ఉయ్యాల నరేష్ గౌడ్, నడింపల్లి గోపాల్, నకిరేకంటి వెంకన్న, మర్రి రమేష్, అశోక్, జానయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

### విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న మోహన్‌రెడ్డి

చిట్యాల : మండలంలోని వట్టిమర్తి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు కథా రచనపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కథా రచనలో సమస్యలు అనే అంశంపై విద్యార్థులకు కథా రచయిత పాటి మోహన్‌రెడ్డి వివరించారు. కథా వస్తువు ఎంపిక, కథ ప్రారంభం, కథలో మలుపులు, ముగింపు, భాషాప్రావీణ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దోకూరి శ్రీనివాస్‌రెడ్డి, కార్యక్రమ సమన్వయకర్తలు పెరుమాళ్ళ ఆనంద్, పొట్లబత్తుల రామకృష్ణ, ఉపాధ్యాయులు యాదయ్య, అరుణకుమారి, నీరజ, రాజు, మధుసూదన్, జయశ్రీ పాల్గొన్నారు.

### దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

చిట్యాల : ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి అన్నారు. చిట్యాల మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఏర్పాటుచేసిన ఉచిత బస్‌పాస్ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం దివ్యాంగులకు బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఆర్టీసీ డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, నాయకులు గోధుమగడ్డ జలంధర్‌రెడ్డి, జడల చినమల్లయ్య, జిట్ట బొందయ్య, సిలివేరు శేఖర్, చిత్రగంటి ప్రవీణ్ పాల్గొన్నారు.


బస్‌పాస్ అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి

### బీఎస్పీ నాయకుల అరెస్ట్

మర్రిగూడ : గట్టుప్పల్, చండూరు మండలాల్లో శుక్రవారం ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా ఆటంకం కలిగిస్తారేమోనని ముందస్తుగా మర్రిగూడ మండలంలోని బీఎస్పీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో బీఎస్పీ జిల్లా ఈసీ మెంబర్ పల్లేటి రవీందర్, గిరి నర్సింహ, నక్క కృష్ణ, గ్యార వెంకటేష్, నారపాక సైదులు, మహేష్ తదితరులు ఉన్నారు.

# వైభవంగా కమలాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

నార్కట్‌పల్లి : మండలంలోని శావల్లి గ్రామంలో గల కమలాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణాన్ని ఆలయ అనువంశిక అర్చకులు కారంపూడి నరసింహాచార్యులు, రాకేష్‌చార్యులు, అర్చకులు విష్ణు, శ్రీనివాసాచార్యులు, అర్జున్‌చార్యులు బృందం ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామిఅమ్మవార్ల ఎదుర్కోలు కార్యక్రమాన్ని భక్తుల భజనలు, మహిళల కోలాటాలు మంగళవాయిద్యాల మధ్య నిర్వహించారు. అనంతరం కల్యాణ వేదిక వద్దకు ఉత్సవమూర్తులను తీసుకొచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. గ్రామానికి చెందిన సిరిగిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉడతల చినవెంకన్న, కన్నెబోయిన స్వామి, నాగరాజు, జాని, నర్సిరెడ్డి హరిబాబులు అన్నదాన కార్యక్రమన్ని నిర్వహించారు.

**పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వీరేశం**

మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం వేడుకల్లో పాల్గొని కల్యాణం తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్నాటి ఉపేందర్, ఉపసర్పంచ్ ఉప్పయ్య, మాజీ సర్పంచ్ సిద్దగోని స్వామి, మాజీ ఉప సర్పంచ్ నిమ్మనగోటి వెంకటేశ్వర్లు, పజ్జూరి వెంకట్‌రెడ్డి, విష్ణు, ముకుందం, ఇద్దయ్య, సాగర్‌రెడ్డి, సైదిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కర్నాటి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకుడు

# యాసంగి సాగుపై రైతులకు శిక్షణ


కేతేపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

కట్టంగూర్ : మండలంలోని పామనగుండ్ల రైతు వేదికలో శుక్రవారం యాసంగి సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్. శ్రీనివాస్ పాల్గొని వరి పంటలో కలుపు నివారణ, నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సలహాలు ఇచ్చారు. వరి నాటు వేసిన దశలో కాండం తొలుచు పురుగు, మొగి పురుగు ఆశించడం వల్ల పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్నారు. వరికి తెగుళ్లు సోకితే వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ముజాహిద్ నాయక్, రైతు బంధు కోఆర్డినేటర్ రాంబాబు, అంజనేయులు ఉన్నారు.

**సస్యరక్షణ చర్యలు పాటించాలి**

కేతేపల్లి : యాసంగిలో సాగుచేసిన వరి పంటలో రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి తెగుళ్ల బారినుంచి కాపాడుకోవాలని కేతేపల్లి మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం అన్నారు. వరి పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై శుక్రవారం కేతేపల్లిలోని రైతు వేదికలో రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. జింక్ దాతు లోప నివారణకు ఇంకా నాటువేయని పొలాల్లో ఆఖరి దుక్కిలో ఎకరాలకు 20 కిలోల జింక్ వేసుకోవాలని సూచించారు. నాటు వేసిన పొలాల్లో అయితే లీటరు నీటికి 2గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటకు కాండం తొలుచు పురుగు ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. దీని నివారణకు ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు బాలరాజు, వీరేష్, ఉమేష్, రైతులు పాల్గొన్నారు.

### వర్గీకరణతోనే మాదిగల బతుకుల్లో వెలుగులు


నల్లగొండ టౌన్ : మాట్లాడుతున్న నాగార్జున

మర్రిగూడ : ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల బతుకుల్లో వెలుగులు ఉంటాయని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి బోడ సునీల్‌మాదిగ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16న బెంగళూరులో జరిగే ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభలకు మాదిగలంతా హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గ్యార శ్రీనివాస్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కామిరె స్వామి, కోకన్వీనర్ ఇరిగి శ్రీశైలం, మండల కన్వీనర్ జిల్లా తిరుమలేష్, ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జీడిమెట్ల రమేష్, బుషిపాక శాంతికుమార్ పాల్గొన్నారు.

**జాతీయ మహాసభను జయప్రదం చేయండి**

నల్లగొండ టౌన్ : బెంగళూరులో ఈ నెల 11న జరిగే ఎంఎస్పీ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ అడెపు నాగార్జునమాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం బకరం శ్రీనివాసమాదిగ అధ్యక్షతన జరిగిన ఎంఎస్పీ నల్లగొండ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ ఫలాలు, మాదిగ , మాదిగ ఉపకులాలకు దక్కాలంటే ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. శీతకాలం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును పెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూరపాటి కమలమ్మ, బొజ్జ దేవయ్య, దుబ్బ సత్యనారాయణ, కత్తుల సన్ని, మాసారం వెంకన్న, నవీన్, బీపంగి యాదయ్య, దున్న యాదయ్య, బీపంగి చంటి, బొజ్జ నాగరాజు, రాజు, శివశంకర్, కె.అజయ్, హరికుమార్, గణపతి, ప్రదీప్, యాదయ్య, సురేష్ పాల్గొన్నారు.

# హైస్కూల్‌ను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతా

మునుగోడు : మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలమైన తరగతి గదులను వెంటనే కూల్చివేసి మైదానం అంతా పరిశుభ్రం చేయాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఆయన వెంట ఎంపీపీ కర్నాటి స్వామి, సర్పంచ్ మిర్యాల వెంకన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తంరెడ్డి, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, ఈద శరత్‌బాబు తదితరులు ఉన్నారు.


పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

### కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

నల్లగొండ టౌన్ : మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మిషన్ భగీరథ ఎస్ఈ కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న రెండోరోజు రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో కార్మికులు పనిచేస్తున్నారన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలుచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోలె సత్యనారాయణ, రవీంద్రకుమార్, వల్లకొండ శంకర్, సుంకరి సైదులు, ఉయ్యాల మురళి, నామ సైదులు, గుర్రం వెంకటేశ్, బెజవాడ మహేష్, అంబటి వేణు, స్వామి పాల్గొన్నారు.

### బండపాలెం ఆలయ చైర్మన్‌గా మారం మీనారెడ్డి

కేతేపల్లి : మండలంలోని బండపాలెం గ్రామంలో గల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థాన చైర్మన్‌గా గ్రామానికి చెందిన మారం మీనారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకిరణ్‌రెడ్డి శుక్రవారం మీనారెడ్డికి నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా మీనారెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

### వైద్యశాల నిర్మాణ పనుల పరిశీలన


మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి

నకిరేకల్ : నకిరేకల్‌లోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రూ.32 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 100 పడకల వైద్యశాల భవన నిర్మాణ పనులకు శుక్రవారం మిర్యాలగూడెం ఎమ్మెల్యే భాస్కర్‌రావుతో కలిసి నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిరుమర్తి మాట్లాడుతూ నకిరేకల్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నానని అన్నారు. వైద్యశాల నిర్మాణ పనులను సకాలంలో పూర్తిచేసి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. వారివెంట నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

### నేడు ఎమ్మెల్యే రాక

మునుగోడు : మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు శనివారం ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి రానున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తంరెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### పాదయాత్రను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : కట్టంగూరు మండలం పామనగుండ్ల నుంచి అద్దంకి బైపాస్ రోడ్డు వరకు డబుల్ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న పిట్టంపల్లి నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించనున్న పాదయాత్రలో ప్రజలు భారీగా పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు తుమ్మల పద్మ పిలుపునిచ్చారు. పాదయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం చంద్రగిరి విల్లాస్‌లో కరపత్రాలను పార్టీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అద్దంకి నర్సింహ, పిన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, నారాయణరెడ్డి, చంద్రయ్య, మధు, వెంకటేశం, నరేష్, యాదయ్య పాల్గొన్నారు.

**కట్టంగూర్‌లో..**

కట్టంగూర్ : మండలంలోని పామనగుండ్ల గ్రామం 65వ నంబర్ జాతీయ రహదారి నుంచి పిట్టంపల్లి మీదుగా అద్దంకి బైపాస్ రోడ్డు వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఈ నెల 9న చేపట్టే పాదయాత్రను జయప్రదం చేయాలని పిట్టంపల్లి మాజీ సర్పంచ్ ఎన్న నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పాదయాత్ర పోస్టర్లను సీపీఎం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రోడ్డు నిర్మించాలని కోరుతూ ఆ గ్రామంలో సంతకాలు సేకరించారు. గోలి స్వామి, ధరణబోయిన సైదమ్మ, కారింగు రమణ, మధు, గాదెపాక సందీప్ ఉన్నారు.